# గోగుపూల పాట


రవీందర్ బెజ్జారపు

*నడిచి వెళ్ళిన కాలం గుర్తుల్ని పరిశీలిద్దామని వెనక్కి తిరిగిచూస్తే విచిత్రం... శూన్యం! కమిలిన నల్లటి పాదాల ఛాయగాని, చిన్నికృష్ణుడి నీలి అడుగు గానీ, నాలో పూసిన గోగుపూల ఆనవాలు గానీ... అసలేది లేదు. తుపాను గాలి ఇసుకలోని జాడల్ని చెరిపివేసినట్లు, జోరున కురిసే వాన ఏ సాక్ష్యాన్ని మిగల్చనీయనట్లు... కాని తుపాను, వాన లేకుండానే అడుగుజాడలు ఎలా మలిగిపోయాయి? లేక ఇన్ని సంవత్సరాలుగా ఒక్క అడుగూ వేయనేలేదా?*

గత కొద్దిరోజులుగా ఎంతో విసుగ్గా ఉంది. ఆఫీసులో ఫైల్లో తలదూర్చి నిన్న, మొన్న, ఆవలిమొన్న... అనుకుంటూ ఒక్కో రోజు వెనక్కి వెళ్ళాను. రెండువారాల కిందట జరిగిన సంఘటన గుర్తుకురావడంతో అస్థిమితం, అసహనం రెట్టింపయ్యాయి.

చాలా ఏళ్ళ తరువాత ఆరోజు ఆమె కలిసింది. చాలా హడావిడిగా ఉంది. కళ్ళలో ఎప్పటిలాగే కాంతి! ఆమె గురించి... ఆమె విఫలమైన వైవాహిక జీవితం గురించి అప్పుడోమాట, ఇప్పుడోమాట. వినవడుతూనే ఉంది. విచారంతో కుంగిపోయి ఉంటుందనుకున్నా. కానీ మొహంలో వింత శోభ కనిపిస్తోంది. చూడగానే అరచినంత పనిచేసింది. కళ్ళలోకి సూటిగా చూసేసరికి తడబడ్డాను. ఆమెను 'జాదూ జారత్' అంటూ కామెంట్ చేసేవాడిని. నా కామెంట్‌ను నిజం చేయునే చేసింది.

''పెళ్ళి విఫలమయింది. జీవితం నఫలమయింది" అంది నవ్వుతూ. 'రాక్షసీ' అనుకున్నాను మనసులో.



''పెళ్ళిగాని, స్నేహంగాని మనల్ని పాతాళంలోకి తోసేసి సమాధి చేస్తున్నప్పుడు ఆ సంకెళ్ళను తెంచుకోవడమే మేలు..." అంది.

"నీ వివరాలేంటి?" అంటూ అడిగింది.

ఉద్యోగం గురించి, నా ప్రేమ వివాహం గురించి, ఇద్దరు పిల్లల గురించి చెప్పాను. "ఇంకా..." అంది. మొన్ననే కట్టుకున్న ఇల్లు గురించి చెప్పాను. "ఇంకా..." అంది. ఆఫీసులోని రాజకీయాల గురించి జోవియల్‌గా చెప్పాను. నవ్వింది. "ఇంకా..." అంటూ రెట్టించింది. ఇంకా ఏం చెప్పాలో తోచలేదు.

"ఇంతేనా?..." అంటూ పెదవి విరిచింది.

ఇన్నేళ్ల నా జీవితాన్ని ఇంతేనా అంటుందేమిటి?

"నీ గురించి చెప్తావేమోనని ఆశపడ్డాను. నువ్వంటే ఒక్తి నువ్వేకాదు. ఒక స్త్రీ భర్త, ఇద్దరు పిల్లల తండ్రి, ఒక ఇంటి యజమాని... నువ్వంటే కేవలం ఇది మాత్రమేకాదు. నీలో నేను చూసిన ఇంకొక వ్యక్తి గురించి కలలు కన్నాను. ఒక కళాకారున్ని, ఒక ఉద్యమకారున్ని... ఎక్సెట్రా... ఐ వాజ్ డిసప్పాయింటెడ్. నువ్వు చెప్తున్నది నీగురించి కాదు. అది మాత్రమే నువ్వయితే, యువార్ నథింగ్... యువార్ నథింగ్..." అంటూ పరిగెత్తినట్లే నడుచుకుంటూ వెళ్ళిపోయింది.

** ** **

చాలామందిలాగే నేనూ ఒక్కోసారి కన్ఫ్యూజన్‌లో పడిపోతుంటాను. బహుముఖాలుగా విస్తరించాల్సిన జీవితం ఏకోన్ముఖం కావడంతో మోనాటనీ ఏర్పడుతుంది. జీవిత పరమార్థాన్ని ఏదో ఒక ఫ్రేమ్‌లో బిగించి చూడడం సాధ్యమేనా? ఎవరికి వారే ఫ్రేమ్‌లు తయారుచేసుకోవాలి. నమూనాలు స్ఫూర్తికోసమే తప్ప, మక్కీకి మక్కీగా అనువదించుకోవడం అనర్థదాయకమనిపిస్తుంది. మరి నా జీవిత నమూనా ఏమిటి? బాల్యం నుండి అనేక దశలు దాటుతూ వచ్చాను. గాల్లో ఎగిరే పతంగితోపాటు నేల మీద పరిగెత్తుతూ కిందపడి గదువ పగులగొట్టుకున్న రోజు బాగా జ్ఞాపకం. బడికి దగ్గరగా ఉన్న నల్లగల్లు దుకాణం బందు చేయించడానికి తీసిన ఊరేగింపులో ఉత్సాహంతో, నిలువెల్ల కమ్మిన ఉద్రేకంతో ముందుకురికిన హైస్కూలు రోజులు... ఆరెస్సెస్ శాఖ... విశాలమైన మైదానంలో పాతిన భగవా ధ్వజం... క్రమశిక్షణతో నిలబడి 'నమస్తే సదావత్సలే..' అంటూ పాడుతుంటే వేయివడగల హైందవత్వం ఆవహించిన ఆవేశం... జ్ఞాపకాలన్నీ ఒకే తీరులో లేవు. కొన్ని చిత్రప్రసాద్, కాపు రాజయ్యల బొమ్మల్లా స్పష్టంగా, మరి కొన్ని పికాసో బొమ్మల్లా అబ్‌స్ట్రాక్ట్‌గా...

మా తాతను చూస్తే ఆశ్చర్యమేసేది. ఆయన పాలేరుగా పనిచేసేవాడు. తనకు ఆమాత్రం ఉపాధి దొరకడమే గొప్ప వరప్రసాదంలాగా భావించేవాడు. పైకి ఎగబాకాలన్న ఆలోచనలేదు. ఆదుర్దాలేదు.

పదో తరగతి వరకు పక్క ఊర్లో చదువుకున్నాను. పెద్ద,పెద్ద క్లాసులు... తక్కువమంది సార్లు... వాళ్ళైనా ప్రతిరోజు కోరుట్లనుండో, జగిత్యాల నుండో రావాలి. నేను హైస్కూల్లో చేరినప్పటి నుండి లెక్కలసారు లేడు. ఇంగ్లీషు క్లాసు అంతంతమాత్రమే. మా బ్యాచ్‌లో చాలామంది కెరీర్ దెబ్బతినటానికి అదొక కారణం. కొద్దిగా ఆర్థిక స్థాయి కలిగినవాళ్ళు తమ పిల్లల్ని జగిత్యాల, కరీంనగర్, మరికొంతమంది గుంటూరు లేదా హైదరాబాద్ పంపించేవారు. మా హరిజనవాడ నుండి ఫారెస్టరు కొడుకు, మరొక సారు కొడుకు కరీంనగర్‌లోని ప్రైవేటు రెసిడెన్షియల్ స్కూల్లో చేరారు.

రెండవసారిగ్గాని పదవతరగతి పాస్ కాలేకపోయాను. పదవతరగతి పాస్ కాగానే నన్ను ముసిరినన్ని ప్రశ్నల్లో నూరోవంతైనా మా తాత జీవితం మొత్తంలో ఎదురుకాలేదనుకుంటాను.

"నేనేం కావాలి..." అని ప్రశ్నించుకున్నాను. డాక్టరునా? ఇంజినీరునా? బ్యాంకు మేనేజరునా?, ఐఏయస్ ఆఫీసరునా?.... అన్ని అవకాశాలకు అర్హత కలిగి ఉండడం జీవితంలో కన్ఫ్యూజన్ కలిగిస్తుంది. ద్వారాలన్నీ తీసినట్లే ఉండేవి, ప్రవేశమే అసాధ్యమయ్యేది.

గతంలో మా తాత పుట్టకముందే సమాజంలో ఆయన స్థానం నిర్ణయింపబడి ఉండేది. పాలేరుగానో, చెప్పులు కుట్టేవాడిగానో, డప్పులు కొట్టేవానిగానో... అంతే...

కాని నేను... ఏది కాదలచుకుంటే అది కాగలను. ఆకాశం నాకు అందుబాటులో ఉంది. అయితే నా రెక్కలే బలహీనంగా ఉండేవి. నా Poor academic background నాకే అవకాశం ఇవ్వదు. గవర్నమెంటు కాలేజీలో చదివే ఎస్సీ పిలగాడు, ప్రైవేటు కాలేజీలో చదివే ఎస్సీ పిలగానితో ఎప్పుడు నెగ్గుకొచ్చేను? అసలు ఉన్న అవకాశాలే తక్కువ. నాలాంటి వాళ్ళు ఆకాశాన్ని అందుకోలేని బలహీన పక్షుల్లా నిరాశగా మబ్బుల వంక చూస్తూ గడపాల్సిందే.

మావాడలోని ఫారెస్టరు కొడుక్కి ఇంజనీరింగ్‌లో, మా సారు కొడుక్కి మెడిసిన్‌లో సీటొచ్చింది. నేను ఇంటర్మీడియట్ తరువాత డిగ్రీలో చేరాను. అదిగో అప్పుడే ఆమె పరిచయం. క్లాసులో మొదటిసారి చూడగానే ఏదో అగ్నిగోళం నావైపు దూసుకువస్తున్నట్లుగా ఫీలయ్యాను.

ఒక నెలరోజుల తరువాతనుకుంటాను, క్లాసులోకి వెళ్ళబోతుంటే మధ్యలోనే ఆపింది. చెట్టుకింద నిలబడ్డాం.

"సెలవు రోజుల్లో ఏం చేస్తారు?" అని అడిగింది.

"ఇంటికెళతాను" అన్నాను.

"...వెళ్ళి, పొలం పనులు... అలాంటివేమైనా?"

"మాకు భూమి లేదు" తల అడ్డంగా ఊపుతూ చెప్పాను.

"మరేం చేస్తారు సెలవుల్లో..." రెట్టించి అడిగింది.

ఆమే చొరవ తీసుకుని మాట్లాడడం మొదట్లో కొంత గర్వం కలిగించినా, ఈ ప్రశ్నల ధోరణి, ఇంటరాగేషన్ పద్ధతి ఆమె పట్ల కొంత అయిష్టతను కలిగించింది.

"ఊరికే... అలా ఏ పనీ లేకుండా, రికామీగా ఎలా గడుపుతారు?" అంటూ ఆశ్చర్యపోయింది. కొన్ని క్షణాల

విరామం తరువాత అకస్మాత్తుగా అడిగింది.

"డప్పు కొట్టడం వచ్చా?" అని! వరే షానయ్యాను. తలాతోక లేకుండా, సందర్భశుద్ధి లేకుండా ఏమిటీ ప్రశ్న?

"నాకు వచ్చు" అంది. నిజంగా విశేషమే. డప్పు నేర్చుకున్న ఆడవాళ్ళు మావాడలో లేరు మరి.

"ఈ ఆదివారం మీరు నాతో పాటు పక్కనున్న అల్లీపురం రాగలరా?" అని అడిగింది.

ఆమె నన్ను బతిమాలుతున్నదో, ఆజ్ఞాపిస్తున్నదో అర్థంకాలేదు. ఆమెతో మాట్లాడుతున్నంతసేపు ఏదో అజ్ఞాత ద్వీపం నుండి వీస్తున్న పరిమళం కమ్ముకున్నట్లు... ఆమె కళ్ళలో, విరాగుల్లో మాత్రమే కనవడే ధిక్కార కాంతి... ఎంతో పరిచయమున్నట్లనిపించే ఆమె స్వరం... ఆమె మాటను నిరాకరించడం కష్టమనిపించింది.

ఆదివారం నాడు ఆమె గ్రూప్ తోపాటు నేనూ వెళ్ళాను. మొత్తం ఆరుగురం ఉన్నాం. వెంట ఒక కంజీర, ఇంకా కొన్ని వస్తువులు. ఊరు నడిబజార్లో నిలబడ్డారు. ఒక అరుగు మీద కూర్చుండి మొత్తం తతంగమంతా చూస్తున్నాను.

ఒకరు కంజీర కొడుతుంటే ఆమె, మిగతా ముగ్గురు కోరస్‌గా పాట అందుకున్నారు. ఆ దృశ్యం చూడగానే అదేదో క్రైస్తవ మత ప్రచార కార్యక్రమంలాగా అనిపించింది. కాని ఆమె పాట మీద ఎప్పుడైతే మనసు లగ్నమయ్యిందో, నా నుండి నేను వేరుపడిపోయాను. ప్రయాణిస్తున్నది ముందుకో, వెనక్కో తెలియడంలేదు.

ఒక ట్రాన్స్... ఒక ఉద్వేగం... అల్లీపురం దాటి, జగిత్యాల జైత్రయాత్ర దాటి... కరీంనగరు... తెలంగాణా తొలినాటి వీరులు అమరులైన హుస్నాబాద్ గుట్టలు దాటి... పాట పూర్తయ్యేసరికి మళ్ళీ లోకంలోకి వచ్చాను. నన్ను రమ్మని పిలుస్తోంది. కూర్చున్న చోటు నుండి లేవలేకపోయాను. తీవ్రమైన జ్వరం వచ్చినట్లనిపించింది. ఒక నిప్పుల దుప్పటి ఒంటినిండా చుట్టుకున్నట్లు, కణకణమండే అస్థివంజరాన్ని ఒంట్లోకి Transplant చేస్తున్నట్లు....

మూడ్నాలుగు పాటలు పూర్తయ్యేనరికి జనం బాగా పోగయ్యారు. అప్పుడు మొదలుపెట్టారు వీధి నాటకం. ఏ వేషాలు, ఏ ఆడంబరాలు, ఏ పటాటోపాలు లేని సహజ వాతావరణంలో వాళ్ళు, నడిచే వచ్చటి చెట్లలాగా కనిపించారు. నిప్పులుముసున్నన్న ఆ ఎర్రటి ఎండలో సైతం వాళ్ళ ముఖాల్లో



చెదరని ఆనందాన్ని చూస్తుంటే వర్షంలో తడిసే పసిపిల్లలు గుర్తొచ్చారు.

> మావాడలోని ఫారెస్టరు కొడుక్కి ఇంజనీరింగ్‌లో, మా సారు కొడుక్కి మెడిసిన్‌లో సీటొచ్చింది. నేను ఇంటర్మీడియట్ తరువాత డిగ్రీలో చేరాను. అదిగో అప్పుడే ఆమె పరిచయం. క్లాసులో మొదటిసారి చూడగానే ఏదో అగ్ని గోళం నావైపు దూసుకువస్తున్నట్లుగా ఫీలయ్యాను. ఒక నెలరోజుల తరువాతను కుంటాను, క్లాసులోకి వెళ్ళబోతుంటే మధ్యలోనే ఆపింది. చెట్టుకింద నిలబడ్డాం.
> "సెలవు రోజుల్లో ఏం చేస్తారు?" అని అడిగింది.

బాణమతి సబ్జెక్ట్. మంత్రగత్తె పాత్ర ఆమెది. చాలా అద్భుతమైన మ్యాజిక్ ప్రదర్శించింది. నిమ్మకాయల్లో నుండి రక్తం రావడం, కొబ్బరికాయల్లో నుండి పూలు రాలడం, సాయిబాబా పటం నుండి విబూది తెప్పించటం, బంగారు గొలుసు సృష్టించడం... చివర్లో మనం మంత్రతంత్రాలు అని నమ్మేవాటిని కొంత ప్రాక్టీసుతో ఏవిధంగా చేయవచ్చో చెప్పింది.

అంతా అయ్యాక నా దగ్గరకు రాగానే "జాదుఔరత్" అన్నాను.

"మాటలు రాని నల్లికుట్లోనివనుకున్నాను. బాగానే పేర్లు పెడతావ్" అంది. మాటాముల్లె అన్నీ సర్దుకున్నాం. బస్సు కోసం ఎదురుచూడకుండానే నడవడం మొదలుపెట్టాం.

"చెప్పు, నువ్వేం చెయ్యాలనుకుంటున్నావు ఈ పల్లెటూరి జనాల కోసం?..." అడిగింది.

కొంతసమయం తీసుకొని, ఆలోచించి చెప్పాను, "పాటలు పాడతాను" అని. "ఏదీ, ఒక పాటపాడు" అడిగింది సంబరంగా. ఆ ఎర్రటి ఎండలో, ఒంటరి దుమ్ము రోడ్డుపై గొంతెత్తి పాడడం మొదలుపెట్టాను. నిర్భయంగా... ఏకాంతంలో ఉన్నప్పుడు ఎంత సహజమైన హావభావాల్తో, స్వేచ్ఛగా పాడతానో అలా...

అప్పటి నుండి వాళ్ళ గ్రూపులో నేనూ ఒక ముఖ్యమైన భాగమైపోయాను. సెలవురోజుల్లో ఏదో ఒక ఊరికి వెళ్ళడం బాణమతి, నిరక్షరాస్యత, అపరిశుభ్రత... లాంటి వాటిపై చైతన్యపరచే విధంగా వీధి నాటకాలు నిర్వహించడం. వీధినాటకంలో ఎంత స్వేచ్ఛ ఉంటుంది! స్క్రిప్టును యథాతథంగా చెప్పనక్కర లేదు. ఆమాటకొస్తే అసలు దేనికీ పక్కాగా స్క్రిప్ట్ తయారుచేసుకోనేలేదు. అప్పటికప్పుడు తోచిన మాటో, పాటో కలిపేవాళ్ళం!

ఒకసారి నేను కిరాయికి వుంటున్న రూం దగ్గరలోనే వరకట్న హత్య జరిగింది. పోలీసులు దోషుల నీడల్ని కూడా తాకలేదు. మేం దాన్ని వీధి నాటకంగా మలిచి వాడవాడలా ప్రదర్శించాం. ప్రజల్నుండి, పత్రికల నుండి అద్భుతమైన ప్రతిస్పందన వచ్చింది. పోలీసులు నిందితుల్ని అరెస్టుచేసి, కేసు పెట్టక తప్పలేదు. వాళ్ళ నుండి మాకేమైనా ప్రమాదం ఉంటుందేమోనని మొదట్లో కొంత భయపడ్డాను. కాని ప్రశంసలు, సూటిపోటిమాటలు, స్ఫూర్తినిచ్చే కరస్పర్శలు అప్పటికే అనుభవంలోకి వచ్చాయి. డిగ్రీ తరువాత మా గ్రూపు సభ్యులం తలోదిక్కు చెదిరిపోయాం. సోషల్ వర్క్‌లో పోస్టుగ్రాడ్యుయేషన్ చెయ్యడం తన ఆశయమని చెప్పిందామె. చాలా సంవత్సరాల తరువాత స్లమ్, రెడ్‌లైట్ ఏరియాల్లో ఆమె చేస్తున్న సోషల్ వర్క్ గురించి పేపర్లలో చదివాను.

ఉద్యోగం కోసం పోటీ పరీక్షలు రాసిరాసి అలసిపోయాను. చివరకు పరీక్ష అవసరం లేకుండానే జిల్లా కోర్టులో ఒక చిన్న ఉద్యోగం దొరికింది, అదీ లంచం పెడితేనే! బహుశా అదే నా జీవితంలోకి స్తబ్దతను తీసుకువచ్చిందనుకుంటాను. వంతులవారీగా, పర్సంటేజీల ప్రకారం నా జేబులో కుక్కిన మొదటి నోటు నా చైతన్యం మీద కప్పిన కఫన్ అయింది. దాన్ని ధరించాక అందరూ నాకు ఆప్తులయ్యారు. ప్రయోజకుడివయ్యావని మెచ్చుకున్నారు. నా కఫన్‌ను చూసి పెదవి విరిచిన మొదటి వ్యక్తి ఆమె!

** ** **

ఆఫీసులో ఉండలేకపోయాను. నడుస్తుంటే రోడ్డు పక్కన మోదుగుచెట్టు కనిపించింది. విస్మయంగా చూసాను. ఇన్ని సంవత్సరాలుగా దీన్ని చూడ్డం ఎలా మిస్సయ్యాను? గోగుపూలను చూడగానే ఆమె మాటలు గుర్తొచ్చాయి.

"నీ పాట గుల్‌మొహర్‌లా Sophisticatedగా ఉండదు. మోదుగు పూసే గోగుపూలలా కాస్త మోటుగా... నునుపు చెయ్యని అసంపూర్తి జానపద శిల్పంగా ఆసక్తిగా... లంఘించి దూకుతూ వెంటపడి తరుముతున్న ఆదిమానవుడి పోలికేకలా ఉంటుంది. పాటనెప్పుడు కోల్పోకు...

మోదుగు చెట్టుకిందే చాలాసేపు నిల్చున్నాను. అది దాని పూలను నాలోపలికి... లోలోపలికి రాలుస్తున్నట్లుగా అనిపించింది.

అంతలో ఏవో నినాదాలు వినిపించాయి. వాటివెంటే డప్పుల చప్పుడు, గజ్జెల మోత, కంజీర పాట... బహుశా ఏదో ఊరేగింపనుకుంటాను. దగ్గరకు రాగానే అర్థమయింది, కరెంటు ఛార్జీలకు వ్యతిరేకంగా తీస్తున్న ఊరేగింపది!

రకరకాల జండాలు నన్ను ఆహ్వానిస్తున్నాయి. ఊరేగింపులోకి చొరబడుతుంటే ఒక యుద్ధంలోకి... ఒక వండగ వాతావరణంలోకి వెళ్తున్నట్లనిపించింది.

పాట అందుకున్నాను. క్షణాల్లో నా చుట్టూ కంజీరా, డప్పులు వచ్చి చేరాయి. అవును, నా పాట ఒక మోదుగుపూవు, ఒక అసంపూర్తి శిల్పం, ఒక ఆదిమానవుడి పోలికేక...

ఏదో గొడవ... ఊరేగింపు చెదిరిపోతోంది. పోలీసులు విరుచుకుపడుతున్నారు. నావైపు దూసుకువస్తున్నది పోలీసు లాఠీయో, జండా కర్రో, తల మీద విరిగాక కూడా తెలియలేదు. ముఖం పైనుండి రక్తం బొట్లుబొట్లుగా కారుతోంది. అది రక్తమా, కాదు. నాపై కప్పి ఉన్న కఫన్‌ను రంధ్రమయం చేస్తున్న ఆసిడ్! ●